


# 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

## గురుసాక్షాత్పరబ్రహ్మం - స్వర్ణబాల గంటి

*"పార్థాయ ప్రతి బోధితాం, భగవతాం నారయణేన స్వయం,*

*వ్యాసేన గ్రుధితాం పురాణమునినా మధ్యే మహాభారతం,*

*అధ్వేతాంమృత వర్షిణీం భగవతీం అష్టాదశాధ్యాయినీం,*

*అంబత్వామను సందధామి భగవద్గీతా భవద్వేషిణీం"*

అంటూ ప్రార్థనతో మొదలు పెట్టి పదునెనిమిది అధ్యాయాలూ కూడా చక్కని రాగంలో రాగయుక్తంగా ఆలపిస్తూ కంఠస్థం చేసేవాళ్ళం మా "భారతమ్మ టీచర్"గారి చలవన. మాడపాటి హనుమంతరావు స్కూల్‌లో ప్రతీ సంవత్సరం కూడ వార్షికోత్సవాలకి రెండు, పన్నెండు, పదునెనిమిది అధ్యాయాలు స్టేజ్ మీద పాడేవాళ్ళం. తరువాత నేను రోజూ నా పిల్లల్ని నిద్రపుచ్చటానికి ఈ ప్రార్థనా గీతాన్నే పాడేదాన్ని. ఇప్పుడు బి.టెక్ చదువుతూ ఒళ్ళో తల పెట్టుకుని అదే పాట పాడమంటారు. దీనంతటికీ మూలం ఆనాటి భారతమ్మ టీచర్ బోధనే అనుకున్నప్పుడు టీచర్ ప్రాధాన్యత ఏమిటో తెలుస్తుంది. ఇంకా ఆ స్కూల్ జీవితంలో ఎందరో టీచర్లు, - లెక్కలకి సావిత్రి టీచర్, భారతీ టీచర్ గార్లు, హిందీకి సుబేదా టీచర్, సైన్స్‌కి ఝాన్సీ టీచర్, రాజ్యం టీచర్ గార్లు, భరత నాట్యానికి సామ్రాజ్య లక్ష్మి టీచర్... ఇలా ఎందరో మరెందరో....

ఇంతమంది "టీచర్"లని తలుచుకున్నానీనాడు "కౌముది" పత్రిక పుణ్యమా అని. వారందరూ కూడా నా వ్యక్తిత్వ వికాసానికి ఎంతో కొంత దోహదం చేసినటువంటివారే.

హైస్కూలు రోజుల్లో మా హెడ్‌మిస్ట్రస్, కస్తూరీ ప్రసాద్ గార్లు ఎంతో ఆదర్శమూర్తులు. మా ఉన్నతి కోసం ఎంతో తపించేవారు. నేను తెలుగు నుంచి ఇంగ్లీషు మీడియంకు, ఆరవ తరగతిలో మారతానంటే

"మరి అమ్మని అడిగావా, ఎందుకు మారాలనుకుంటున్నావ్?" అని అన్నారావిడ.

"ఏమీ లేదు, వద్దనదు" అని బుంగమూతి పెట్టి ఆ సైన్స్‌లో బూతుమాటలు నేను చదవలేను" అని చెప్పానని ఆవిడే అమ్మకి చెప్పారట. ఐదో క్లాసులో మనిషి బొమ్మ గీసి శరీరభాగాలన్నీ ఒక్కొక్కటిగా పేర్కొనాలి, కొన్ని భాగాలు పలకటానికి మరీ ఇబ్బందిగా ఉండేది. నవ్వేసి "సరేలే ఉత్సాహంగా ఉన్నావుగా వెళ్ళు" అని ఆవిడ పర్మిషన్ ఇచ్చేసారు.

భారతీ టీచర్‌గారు చాలా స్ట్రిక్ట్ - లెఖ్ఖలు తప్పు చేస్తే సహించలేకపోయేవారు. అందరికీ ఆవిడంటే హడల్. ఆవిడ ఎం.ఏ మాథ్స్ చేస్తున్నారప్పుడు. "మాథ్ మెటిక్స్ ఒలింపియాడ్"కి ఓ శనివారం ప్రొద్దుట మోడరన్ మాథ్స్ నేర్పించి మధ్యాహ్నం కల్లా పరీక్ష రాయించేసారు మా చేత. నాకు 30 కి 29న్నర. లెక్కలు సరిగ్గా చేయటంతో మూడో రాంక్ వచ్చింది. అసలు విషయం ఏమిటంటే ఆ పరీక్ష యొక్క ఫీజ్ రెండు రూపాయలు. ఆవిడ అది తీసుకోను కూడా తీసుకోలేదు నా దగ్గర. ఇది ఆవిడ నాకిచ్చిన బహుమతి. ఎందుకంటే నాకు లెక్కలంటే ప్రాణం, ఎనిమిదవ తరగతి ఎండాకాలం సెలవల్లో సగానికి సగం పుస్తకంలోని లెఖ్ఖలు 400 పేజీల పుస్తకంలో చేసేసాను. తొమ్మిదవ తరగతి తెరిచాక అదే పుస్తకంలో వెనగ్గా మొదలుపెట్టి చేసాను. హోమ్ వర్క్ చూస్తూ ఆవిడ దాన్ని చూసేవారు. అంతే ఒక్కసారిగా కోపం వచ్చేసింది.

"నీకు ట్యూషన్ ఉందా? ఇవన్నీ ముందే చేసేసావ్, నేను క్లాసులో చెప్పకుండానే. అవి వేరే నోట్ బుక్‌లో చెయ్యాలి, క్లాస్ వర్క్‌లో చేస్తే ఎలా?" అని ఆ చేసిన పేజీలు చింపి డస్ట్‌బిన్‌లో పారేసి, బెల్లుకొట్టారేమో, వెళ్ళిపోయారు.

"కాదు టీచర్" అన్నా వినలేదు. ఏడుస్తూ కూర్చుంటే పిలిపించారు. మా పిన్ని, సావిత్రి టీచర్ గారి దగ్గర తెలుసుకున్నారట "నాకు లెక్కలంటే ఇష్టం కొద్దీ చేసాననీ, తప్పులూ, తడకలూ కాదనీ, అవన్నీ ఆవిడకి చూపించాననీ, సెలవుల్లో, టైమ్ వృధా చేయకుండా మా అమ్మగారు చెబితే తానే నాకు నేర్పించాననీ" చెప్పారట ఆవిడ. ఆ తరువాత తానే నాకొక 400 పేజీల పుస్తకం కొనిచ్చి మళ్ళీ అన్నీ చేయటానికి ప్రోత్సహించారు, నాకు ట్యూషన్ పెట్టించుకునే ఆర్థిక స్తోమత లేదని తెలిసి, అన్నీ పిన్ని చేయించారని.

ఆవిడ మాత్రం ఎప్పుడూ ఎవరైనా హోమ్ వర్క్ చేయకపోతే బోర్డ్ మీద "రేపు అని వ్రాయనా, అది ఎన్నటికీ రాదు" అనేవారు. దాంతో బెదిరి అందరూ చేసేసేవారు.

తరువాత కళాశాలల్లో లక్ష్మీ మేడం గారు, డా.సాయి ప్రకాశ్ గారు, ప్రొ.ఖాటావ్‌కర్ గారులాంటివారు కూడా ఎంతో ప్రోత్సాహాన్నిచ్చి నాకు కూడ ఒక "గురువు" అవ్వాలన్న కోరికను పెంచారు.

విద్యారణ్యా స్కూలులో ఎల్.కె.జిలో " భవిష్యత్‌లో ఏమి అవ్వాలనుకుంటున్నారు?" అని టీచర్ అడిగిన ప్రశ్నకి "టీచర్ అవుతాను" అని అన్నానట, అమ్మ చెబుతూ ఉంటుంది. వాళ్ళంతా ఎంతో మురిసిపోయారుట. మా అమ్మగారి లాగే నాకు టీచింగ్ అంటే ఎంతో మక్కువ. ఇందరున్నా మా అమ్మ - డా.మంగమాంబగారు కానీ, భరతనాట్య - కూచిపూడి నృత్యాల్లో నిష్ణాతులైనటువంటి - డా.ఉమారామారావుగారు కానీ, కెమిస్ట్రీ ప్రొఫెసర్ - డా. రాజశేఖరన్ గారిలాంటి వారిని నేనెక్కడా చూసెరగను ఇన్నేళ్ళ జీవితంలో. వారి ముగ్గురి యొక్క ప్రభావం నా మీద అంతా ఇంతా కాదు. ఏకంగా తిరుమల గిరి సప్తశిఖరాల్లా ఎంతో ఎంతెంతో ఎత్తు. నేనీనాడు ఇంత ఉన్నత స్థాయిలో ఉన్నానంటే, ఇన్నిపనులు అవలీలగా చెయ్యగలుగుతున్నానంటే, ఇన్ని రంగాల్లో ప్రావీణ్యం సంపాదించానంటే, అదంతా కూడా నిజమైన "గురువు"లు అయినటువంటి ఈ ముగ్గురి దీవనలే. వారంతా కూడా నా "స్వయం వికాసానికి" ఎంతో తోడ్పడ్డారు.

ఇక ఉమాటీచర్ గారితో సంబంధం ముప్పై ఏళ్ళనాటిది. మొదటిసారి మ్యూజిక్ కాలేజీలో కలిసాను, భరతనాట్యం చేర్చుకోవటానికి. అప్పటికే స్కూల్‌లో కొంత నేర్చుకున్నానేమో వెళ్ళగానే అలరింపు, జతి స్వరం చేయించి "సరే నువ్వు సెకండ్ ఇయర్‌లో జేరు" అన్నారు. నేను ఐదారు సంవత్సరాలు రోజూ కాలేజీ తరువాత వెడుతూ వచ్చేదాన్ని. అయితే నాకు మా గురువుగారి వద్ద కూడ ప్రేరణతోనే విద్య వచ్చింది అనటానికి ఎటువంటి సందేహమూ లేదు. అక్కడ కూర్చుని నేర్చుకున్న ప్రతీ పాఠం కూడ అచ్చం మా

అమ్మగారు చెప్పినట్లే ఉండేది. ఎంతో శ్రద్ధగా నేర్చుకునేవాళ్ళం. ఈనాడు ఇంజినీరింగ్ చదువుతున్న మా అమ్మాయి కూడా ఆవిడ దగ్గరే శిష్యరికం చేసి 'కూచిపూడి' కళాకారిణిగా రూపుదిద్దుకుంటోంది. ఎన్నోమార్లు ఇద్దరం కలిసి కూడా నృత్యం చేయగలుగుతున్నాం



మా అమ్మాయి, డా.ఉమా రామారావు గారు

ఉమా టీచర్ గారు ఎన్నో పురాణేతిహాసాల గురించి వివరిస్తుంటే అందరం ఎంతో శ్రద్ధగా వింటాం. ఎంతో ప్రేరణోపేతంగా ఉంటాయి. నాట్యానికి కావలసిన భావోత్పత్తి, రసోత్పత్తి కూడా నేర్పేటప్పుడే కలగటం జరుగుతుంది. అందుకేలా ఉంది పిల్లలు, పెద్దలూ కూడ ఎంతో కష్టపడిపోతున్నట్లుగా కాకుండా, రసవత్తరంగా నాట్యాన్ని ఆ ఎసెన్స్ మాత్రం తీసుకుని ప్రేక్షకులకు ఆనందం కలిగించేలా ప్రదర్శనలు ఇస్తూ ఉంటారు. ఆవిడను గురువుగా పొందటం మా అదృష్టం.

నాట్యాన్ని హాబీగా నేర్చుకుని, చిన్న చిన్న ప్రదర్శనలు ఇస్తూ, నా కూతురుకి ప్రేరణగా నిలబడగలిగానన్న తృప్తితోపాటు, రసాయన శాస్త్రంలో ఎంతో కొంత కృషి నా మటుకు నేను చేయగలిగాను, చేస్తున్నాను, నా ఈ చిన్ని పరిధిలో గుర్తింపబడ్డాను. అంటే మా పి.హెచ్.డి, మెంటర్, గురువుగారు డా.రాజశేఖరన్ గారు కారణం.. 6 సంవత్సరాలు రీసర్చ్ అసోసియేట్ షిప్ అదే లాబ్‌లో చేయటం నా అదృష్టం అనే చెప్పాలి. విశ్వవిద్యాలయాల్లో మామూలుగా ఎవరూ కూడ శిష్యులని ఒక్కొక్కరిని కూర్చోబెట్టి చెప్పటం జరగదు. కానీ ఆయన మాకందరికీ కూడ ఎవరి పని వారితో క్షుణ్ణంగా పరిశీలించి తెలియకపోతే నేర్పి, ఓపిగ్గా మళ్ళీ మళ్ళీ చేయించి, మా చేత మంచి నాణ్యత కలిగినటువంటి పని చేయించేవారు. వాటన్నింటినీ కూడ ఎంతో సరళంగా, కుదించి, అందరికీ అర్థం అయ్యే విధంగా పేపర్ల రూపంలో వ్రాయించేవారు.

ఆయన ఎప్పుడూ అనేవారు "I want to be known through my Students" అని. అది చాలా నిజం. ఎవ్వరైనా కానీ మెచ్చుకోవాలన్నా, కించపరచాలన్నా కూడ "ఎక్కడ చదివావు? ఎవరు నేర్పారు?" అని అడుగుతారు కదా!! అక్కడే తెలుస్తుంది "గురువు"కి ఉన్న విలువ. అలా అన్నందుకు ఒళ్ళు దగ్గర పెట్టుకుని, జాగర్తగ పనిచేయాలి మరి మేమందరం కూడ. గురువులు ఎప్పుడు శిష్యులు తమకంటే ఉన్నతంగా, గొప్ప విజ్ఞాన ఘనులుగా ఉండాలని అనుకుంటారు. తమను మించిన శిష్యులను తయారు చేసేవారు చాలా అరుదు. అయితే ఆ శిష్యులకి మళ్ళీ శిష్యులు... అలా గురుశిష్య పరంపరగా భారతదేశం కొనసాగుతోంది. గురువులు తమ శిష్యులకోసం, శిష్యులు తమ గురువుల కోసం తహ తహలాడి, వెతికి వారిని పొంది, ధన్యులయ్యే సంఘటనలు ఈ కాలంలో తక్కువే అయినా, లేకపోలేదు. గురువు చెప్పనిదే ఏ విద్యా రాదన్నది చాలా వాస్తవం.

ఈనెల గురుపూజా దినోత్సవ సందర్భంగా నేను ఇలా నా గురువులను తలుచుకోవటం నాకెంతో ఆనందంగా ఉంది. అందరు గురువులకు పాదాభివందనం చేస్తూ ఈ చిన్ని కావ్యాంశం. ఈ అవకాశానికి ధన్యురాలిని.



రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్న స్వర్ణబాల గారు, ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. వివిధ సంస్థలకి క్వాలిటీ డాక్యుమెంటేషన్ చేస్తుంటారు. లూపిడ్ ల్యాబ్స్‌లో క్వాలిటీ మేనేజర్‌గా కూడా ఉన్నారు. తెలుగు సాహిత్యం అంటే మక్కువ. కూచిపూడి నృత్యంలో డిప్లమో చేశారు.